మురుగునీటి సమస్యకు పరిష్కారం

కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్,మే 25: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న మురగు నీరు సమస్యను అధికారులతో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు.శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ..మురుగు నీటి సమస్యపై ఇప్పటికే జలమండలి అధికారులతో చర్చించామన్నారు. అలాగే స్థానిక ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుకు వెంటనే స్పందించామన్నారు. వరుసగా వర్షాలు పడుతుండడంతో పైపులైన్‌లలో మట్టి కుప్పలు పేరుకుపోయి మురుగు నీరు సాఫీగా వెళ్లక డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని బ్రాహ్మణబస్తీ,మేడిబావి,నామాలగుండు, ఉప్పరిబస్తీ ప్రాంతాల్లో మురుగు సమస్య ఎక్కువగా ఉన్నందున్న సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరిస్తామన్నారు.

గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్..

కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కాచిగూడ డీఎం రఘు, డాక్టర్ వెంకటేశ్వరగౌడ్, సిబ్బంది

కాచిగూడ,మే 25: ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మే 25 నుంచి జూన్ 1 వరకు గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని ఆర్టీసీ సంస్థ నిర్వహిస్తున్నదని కాచిగూడ డిపో మేనేజర్ టి. రఘు తెలిపారు.

శనివారం డిపోలో పనిచేస్తున్న కార్మికుల కోసం హెల్త్ ఛాలెంజ్ పేరు తో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం రఘు మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికుల సంక్షే మం కోసం ఆర్టీసీ కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైంటిస్ట్ డాక్టర్ వెంకటేశ్వర గౌడ్, శ్రీనివాసులు, వాసవి, రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ పట్టుదల ఉండాలి

సాయికుమార్‌ను అభినందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, మే 25: పట్టుదలతో శ్రమిస్తే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించడం సాధ్యమని నిరూపించాడు ఓ నిరుపేద యువకుడు. అంతర్జాతీయ స్థాయి కరాటేలో 70 కిలోల విభాగంలో పాల్గొని బంగారు పతకం సాధించిన సందర్భంగా శనివారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన ఈ పోటీల్లో సాధించిన బంగారు పతకాన్ని ఎమ్మెల్యే తలసాని కలిసి చూపించారు. అనంతరం గోల్డ్ మెడల్ సాధించిన సాయి కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగరానికి గుర్తింపు తీసుకురావడం సంతోషకరమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించాలని ఆశీర్వదించారు. ఉన్నత స్థాయిలో రాణించే విధంగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటేశంరాజు తదితరులు పాల్గొన్నారు.

సాయికుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

నిధులున్నాయి..పనులు చేపట్టండి

జలమండలి జీఎంకు బీఆర్ఎస్ నాయకుల వినతి

జలమండలి జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్, మే 25 : రామస్వామి కాంపౌండ్ బస్తీలో ఎనిమిది నెలల క్రితం నూతన తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ల ఏర్పాటు కోసం నిధులు మంజూరై ఎనిమిది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు పనులను ప్రారంభించలేదని బీఆర్ఎస్ నాయకులు ఆర్.నాగభూషణం, ఆర్. సురేశ్ కుమార్‌లు ఆరోపించారు. ఈ మేరకు శనివారం వారు మారేడ్‌పల్లిలోని జలమండలి జనరల్ మేనేజర్ కేఎస్.వినోద్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏండ్ల క్రితం వేసిన డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు శిథిలావ్థకు చేరాయని, బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు గత ఏడాది సెప్టెంబర్ మాసంలో నిధులను మంజూరు చేశారని పేర్కొన్నారు. వీలైనంత త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని జీఎం సానుకూలంగా స్పందించారని నాగభూషణం, సురేశ్‌కుమార్‌లు తెలిపారు.

సజీవంగా కళలు..

రవీంద్రభారతి : కళలు తెలుగు నేలపై సజీవంగా ఉంటాయని కూచిపూడి నాట్యగురువు డా.పసుమర్తి శేషుబాబు అన్నారు. భారతవేద ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గోదా కల్యాణం కూచిపూడి యక్షగానం శనివారం రవీంద్రభారతిలోని ప్రధాన వేదికపై నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పసుమర్తి శేషుబాబు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస వరప్రసాద్ శిష్య బృందంచే గోదా కల్యాణం కూచిపూడి యక్షగానం నృత్య ప్రదర్శన వీక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో భారత్ వేద ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరమ వీరచక్ర పార్కు ప్రారంభం

పరమ వీర చక్ర పార్కును ప్రారంభిస్తున్న సుబేదార్ మేజర్ సంజయ్ కుమార్,మిలటరీ అధికారులు

బొల్లారం,మే 25: పరమ వీరచక్ర అవార్డు గ్రహీతల అత్యున్నత ధైర్య సాహసాలకు,త్యాగాలకు నివాళిగా పరమ వీరచక్ర పార్కు నిలుస్తుందని సుబేదార్ మేజర్(పీవీసీ) సంజయ్ కుమార్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా(టాసా)లో కొత్తగా ఏర్పాటు చేసిన పరమ వీరచక్ర పార్కును టాసా కమాండింగ్, మిలటరీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అసమానమైన ధైర్యంతో దేశానికి సేవ చేసిన ధైర్యవంతుల త్యాగాలను స్మరించుకోవాలని తెలిపారు. అమర వీరుల త్యాగాలతో పాటు ధైర్య సాహసాలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు పార్కును రూపొందించడంలో పాల్గొన్న వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో 1ఈఎంఈ,ఏఓసీ సెంటర్ మిలటరీ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను మెరుగుపర్చండి



జలమండలి జేటీఓ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బన్సీలాల్‌పేట్, మే 25 : చాచానెహ్రూనగర్ బస్తీలో తాగునీటి సరఫరా మెరుగుపరచాలని కోరుతూ స్థానికులు శనివారం న్యూబోయిగూడలోని జలమండలి సెక్షన్ కార్యాలయంలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ శివశంకర్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..తమ బస్తీలో నీటి సరఫరా సమయాన్ని తగ్గించారని, తక్కువ ప్రెషర్‌తో నీటి సరఫరా అవుతుందన్నారు. కచ్చితమైన సరఫరా సమయం పాటించడం లేదని, ఎక్కువ మంది పేద ప్రజలు కూలీ పనులకు వెళ్తారని అందుకనుగుణంగా ఉదయం ఆరు గంటలకు నీటి సరఫరాను మార్చాలని వారు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కార చర్యలు తీసుకుంటామని జేటీఓ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గజానంద్, ఆశిశ్, మల్లీశ్వరి, మమత, జయశీల, శరణ్య, స్వాతి, లక్ష్మమ్మ, నర్సమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ డైమండ్ పాయింట్ రాజరాజేశ్వరి గార్డెన్‌లో శనివారం పెన్ మహోత్సవ్ ఆధ్వర్యంలో ట్రేడ్ ఫేర్ కార్యక్రమాన్ని కేఎన్.కుమార్ ఐఏఎస్,తెల్లా మురళీధర్,వొందాడ రాఘవేంద్ర రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ ట్రేడ్ ఫేర్‌లో 130 బిజినెస్ స్టాల్స్ ఏర్పాటు చేశామని,రెండు రోజులు పాటు ఫేర్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.– కంటోన్మెంట్

గృహిణి అదృశ్యం

కాచిగూడ, మే 25: గృహిణి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై పి. రవికుమార్ తెలిపిన ప్రకారం.. చెప్పుల్‌బజార్‌కు చెందిన నరేందర్ భార్య కడేల్ తేజస్విని(38) ఈనెల19న ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త నరేందర్ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తెల్ల రంగు పైజామా ధరించి, 5.7 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కంటోన్మెంట్ మూడో వార్డు పరిధిలోని అన్నానగర్ శ్రీ పాతాళ పంచముఖ వీరాంజనేయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆంజనేయ స్వామి దీక్ష పరులతో మహాపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు. – బొల్లారం,మే 25

వాహనాల దొంగల అరెస్టు

నిందితులను విలేకరుల ఎదుట హాజరుపరిచిన పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 25: నిలిపి ఉంచిన వాహనాలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న ఉదయం 7.40 గంటలకు శివప్రసాద్ అనే రైల్వేలో పనిచేసే వ్యక్తి తన బైక్ (పల్సర్ 150 డీటీఎస్1బీ111) ఏపీ 10 ఏవై 1768ను సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో నిలిపి కర్నూల్‌కు వెళ్లి తిరిగి 19న ఉదయం తిరిగి రాగా, అక్కడ తన బైక్ కనిపించలేదు.
వెంటనే శివప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోవిందప్ప కుడిగె సునీల్ అలియాస్ సునీల్ (34), అతడి భార్య షెహనాజ్ సుల్తానా (41) కలిసి నిలిపి ఉంచిన వాహనాలను చోరీ చేసి, మహ్మద్ ఖదీర్ పాషాకు విక్రయించేవారు. వాటిని ఖదీర్ విడిభాగాలు విప్పి, వాటిని విక్రయించేవాడు. వారిపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. చోరీ కేసును దర్యాప్తు చేస్తున్న ఓయూ పోలీసులు సికింద్రాబాద్ సమీపంలో శనివారం ఉదయం 5.30 గంటల సమయంలో సునీల్, షెహనాజ్ సుల్తానాలను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు ఖదీర్ పాషాను సంతోష్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్‌లు, నాలుగు టైర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.

క్రీడాకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

హిమాయత్‌నగర్, మే 25: రాష్ట్రంలోని క్రీడాకారులను మరింత ప్రోత్సాహం అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు కోరారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో క్రీడా అభివృద్ధి కోసం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని సాంబశివరావును కోరినట్లు ఆయన చెప్పారు.
ఈ కార్యక్రమంలో టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, నాయకులు రాజుయాదవ్, పానుగంటి పర్వతాలు పాల్గొన్నారు.

ఏవీ కళాశాలలో.. నాలుగు కొత్త కోర్సులు

కవాడిగూడ, మే 25 : హైదరాబాద్ దోమలగూడలోని ఏవీ సైన్స్ అండ్ కామర్స్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ స్థాయిలో 4 కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, కరస్పాండెంట్ కే. గౌతమి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలతో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంచే దిశగా ఈ కోర్సులు దోహదం చేస్తాయని వివరించారు. బీఏ జర్నలిజం, డాటా సైన్స్, బీకాం ఫైనాన్స్, బయోటెక్నాలజీ లాంటి కోర్సులను విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అందుబాటులోకి తీసుకురానున్నదని తెలిపారు. ఈ నాలుగు కోర్సులకు సంబంధించి దోస్త్ నోటిఫికేషన్‌లో ఉన్నాయన్నారు. విద్యార్థులు జాగ్రత్తగా గమనించి కోర్సులను ఎంచుకోవాలని కోరారు.

బీసీల రిజర్వేషన్లు పెంచిన తరువాతే.. ఎన్నికలు నిర్వహించాలి

మాట్లాడుతున్న బీసీ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ

కాచిగూడ, మే 25 : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. గుజ్జ కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కులగణన పట్ల సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలని, బీసీలకు 50 శాతం రిజర్వేన్లు అమలు చేసిన అనంతరమే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో నీల వెంకటేశ్, జనార్దన్, నందగోపాల్, వీ.రామకృష్ణ, ఉదయ్, ప్రణితరాణి తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల యాదిలో.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై సబ్బండ వర్గాలు పాల్గొన్నాయి. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలు వదిలిన అమరవీరుల జ్ఞాపకార్థంగా డాక్టర్ బీఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఎదుట, నగరం నడిబొడ్డున అమరు వీరుల స్థూపాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఏర్పాటు చేశారు కేసీఆర్.

చెత్త రహిత ప్రాంతంగా అంబర్‌పేట

అంబర్‌పేట, మే 25 : చెత్త రహిత ప్రాంతంగా అంబర్‌పేట సర్కిల్‌ను తీర్చిదిద్దుతామని సర్కిల్ మెడికల్ ఆఫీసర్(ఏఎంఓహెచ్) డాక్టర్ హేమలత అన్నారు. శనివారం సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌పోర్ట్ పాయింట్‌ను ఉన్నతాధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి రోజూ చెత్త సేకరణ చేయాలని, సేకరించే సమయంలో ఎక్కువ డబ్బులు డిమాండ్ చేయవద్దన్నారు. ప్రజలతో ఇష్టానుసారంగా మాట్లాడవద్దని, చెత్త సేకరణపైనే పూర్తిస్థాయి దృష్టి పెట్టాలని సూచించారు. నగరంలో జీవీపీ ఎలిమినేషన్ లక్ష్యం చేరుకోవాలంటే అందరి సహకారం కీలకమని తెలిపారు. గతంలో ఉన్న గార్బేజ్ వాల్నరేబుల్ పాయింట్స్‌ను కొంతవరకు తొలగించగలిగామని, అదే స్ఫూర్తితో జనం సహకారం తీసుకొని కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఆదేశాల మేరకు అంబర్‌పేటను స్వచ్ఛ ప్రాంతంగా తీర్చిదిద్దడానికి నడుం బిగించాలని కోరారు. శానిటరీ సూపర్‌వైజర్ తిరుపతినాయక్, రాంకీ, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో సమావేశమైన ఏఎంఓహెచ్ హేమలత

కళాకారులు ప్రజలను చైతన్యం చేయాలి

హిమాయత్‌నగర్, మే 25: ప్రగతిశీల కళాకారులు తమ సృజనాత్మకమైన కళారూపాలతో ప్రజలను చైతన్యపరిచి, ఇప్టా వారసత్వాన్ని ముందుకు సాగించాలని ఇప్టా జాతీయ ఉపాధ్యక్షుడు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి పల్లె నరసింహ పిలుపునిచ్చారు. ఇప్టా 81వ ఆవిర్భావ దినోత్సవం శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య, లౌకికవాద పరిరక్షణ కోసం విభిన్న భాషలకు చెందిన రచయితలు, కవులు, కళాకారులు అభ్యుదయ భావాలతో ఇప్టా సంస్థను స్థాపించారని గుర్తుచేశారు. అన్యాయాలకు వ్యతిరేకంగా స్వరం పెంచడం లక్ష్యంగా పెట్టుకుని అణగారినవర్గాల వాణిని వినిపించేందుకు ఇప్టా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, నాయకులు కె.లక్ష్మి నారాయణ, కె.ఉప్పలయ్య, సైదులు, విజయ్, డప్పు వెంకన్న, వెంకటేశ్, స్వామి, బి.స్టాలిన్, విలాస్‌రావు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి మల్లయ్య చేసిన సేవలు మరువలేనివి

కవాడిగూడ, మే 25: బీసీల హక్కుల కోసం, గంగపుత్రుల సంక్షేమానికి ఏఎల్ మల్లయ్య చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, ఉపాధ్యక్షుడు గూడబోయిన శివరత్నం, ఏర్వ బాలయ్య, కోశాధికారి ఎర్రబోయిన మల్లేశ్ అన్నారు. శనివారం తెలంగాణ గంగపుత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏఎల్ మల్లయ్య జయంతి సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహం వద్ద పలువురు నివాళులర్పించారు. ఆర్‌కే భగవాన్, అంబటి మల్లయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

జాతీయ త్రోబాల్ టోర్నీలో తెలంగాణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పాటియాలా(పంజాబ్) వేదికగా ఈ నెల 28 నుంచి మొదలయ్యే 29వ జాతీయ సబ్ జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌నకు తెలంగాణ బాలుర, బాలికల జట్లను శనివారం ఎంపిక చేశారు. బాలుర టీమ్ కెప్టెన్‌గా సిద్దార్థ్, బాలికల జట్టుకు రక్షిత నాయకత్వం వహించనుంది. జట్ల ఎంపికతో పాటు ప్లేయర్లకు ప్లేయింగ్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ యాదవ్, ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, కిరణ్‌చారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు యాదగిరికి ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో యాదగిరి డాక్టరేట్ సాధించారు. డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో 'బందారు సదాశివరావు సాహిత్యం – సమగ్ర పరిశీలనం'పై పరిశోధన పూర్తి చేసి యాదగిరి సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పరిశోధన పూర్తి చేయడం విశేషం. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.
– ఉస్మానియా యూనివర్సిటీ, మే 25